# ఇదీ ఓ కథే!

ఈ మధ్యనే ఓ సాహిత్యసభలో ప్రముఖ పత్రికాసంపాదకుడు, సర్వేశ్వరరావు కనబడి "ఏమిటీమధ్య మీరు కథలు రాస్తున్నట్టు లేదు!" అన్నాడు.

"ఏమిటో! బద్ధకం పెరిగి పోయిందండి" అన్నాను.

"అలా అంటే ఎలాగ. మీరు కథలు రాయాలి. అవి యువతరానికి స్ఫూర్తి నివ్వాలి. ఒకటి రాసిపంపండి." అన్నాడు.

"అలాగే" అన్నాను.

"అలాగే అంటే కాదు. తప్పకుండా రాసి పంపుతానని మాటివ్వాలి" అన్నాడు.

"ఆల్‌రైట్ తప్పకుండా రాసి పంపుతాను" అన్నాను.

"అలా అన్నారు బాగుంది. దటీజ్ ది స్పిరిట్, థేంక్స్" అన్నాడు. ఆయన అభిమానానికి ఆనందించి మాటిచ్చేనుకాని, రాయాలి కదా!

నిజం చెపొద్దూ! కథరాయాలన్నా చదవాలన్నా వెనకటి రోజుల్లోలాగ ఉత్సాహంవుండటం లేదు. మరి నా దృష్టి దోషమో, అభిరుచి లోపమో, దురభిమానమో తెలీదు. మాతరం వాళ్ల రచనల్లో వున్న శిల్పం, సౌరభ్యం, చమత్కారం ఈనాటి కథల్లో లేవేమో అనిపిస్తుంది. ఆ రోజుల్లో ప్రతి రచయిత పేరూ ఒక ప్రత్యేకమైన బాణీకి ట్రేడ్ మార్క్. ఈ రోజుల్లో పత్రికల్లో కొత్త వాళ్ల రచనలు పుంఖాను పుంఖాలుగా వొస్తున్నాయి కాని ఏమిటో వాటి ధోరణే వేరు.

రెండు రోజులక్రితం, ముప్ఫయ్యేళ్లుంటాయి, కుర్రాడి పేరు సురేష్, మేమున్న బిల్డింగ్‌లోనే కిందఫ్లోర్‌లో వున్న ఫ్లాట్‌లో వుంటాడు, కాలేజ్ లెక్చరర్.

"అంకుల్! బిజీగావున్నారా?" అంటూ వొచ్చేడు.

"కమాన్ కమాన్, కూర్చో. ఏమిటి విశేషం?"అంటూ ఆహ్వానించేను.

"వెంకట్ నడిగి మీ కథల పుస్తకం పట్టికెళ్లేను. వండర్‌ఫుల్, చాలాబాగున్నాయి అంకుల్. చిలకజోస్యం కథ రియల్లీ యేమాస్టర్ పీస్" అన్నాడు కూర్చున్నాక. వెంకట్ మా అబ్బాయి. వాడూ యితనూ కోలీగ్స్.

"మా వీథిభాగోతం, "మునసబుగారమ్మాయి" కథలెలావున్నాయి?" అని అడిగేను, ఏమంటాడో విందామన్న కుతూహలంతో.

"అన్ని కథలూ చాలాబాగున్నాయి అంకుల్, మీకో చిన్న పని కల్పించడానికొచ్చేను" అన్నాడు పొడుగాటి కవర్ తీస్తూ.

నిజానికి అలాంటి పేర్లతో నేను కథలు రాయలేదు. అంటే ఇతను నా కథల పుస్తకం పట్టికెళ్లేడు కాని చదవలేదని తెలుస్తూనే వుంది. కొందరి వ్యక్తుల పేర్లతో, వాళ్ల ముందూ వెనకా ఏమిరాసినా, కొన్ని రచనల పేర్లు ముడిపడివుంటాయి. మాటవరసకి పద్మరాజు గాలివాన, జాషువా గబ్బిలం, బుచ్చిబాబు చివరికి మిగిలేది, రావిశాస్త్రి సారో కథలు యద్దనపూడి సెక్రటరి, ముళ్లపూడి జనతా ఎక్స్‌ప్రెస్ ఎట్‌సెట్రా ఎట్‌సెట్రా. అలాగే చిలకజోస్యం నా లేబుల్, అది అతను విని వుంటాడు.

"ఊc! ఏమిటి! నువ్వేదైనా కథ రాశావా?" అని అడిగేను, కవర్‌లోంచితీసి అందిస్తున్న కాగితాల కట్టచూసి.

"అవును అంకుల్, దీన్ని మీరు శ్రమనుకోకుండా చదవాలి" అన్నాడు.

రచయితగా రాణించాలంటే స్కూల్ మేస్టరో, కాలేజ్ లక్చరరో, గవర్నమెంట్ ఉద్యోగో, ఉద్యోగం కోసం ప్రయత్నించని నిరుద్యోగో, లాయరో అయివుండాలి. వాళ్లకి కావల్సినంత సామాజిక స్పృహోఛ్వాసనిశ్వాసాలకి అవకాశం తీరుబడి వుంటాయి. మా అబ్బాయి కూడా నా చిలకజోస్యానికి వాడి ముతక హాస్యం జోడించి ఓ కళాఖండంగా రూపొందించి తెలుగు టి. వి. ప్రేక్షకుల కలవాటైన ఓ క్రూడ్ ఎపిసోడ్ తీద్దామన్న దీక్షలో వున్నాడని తెలిసింది. ఇంతకీ సురేష్ కథకి 'గ్రీటింగ్‌కార్డ్' అని పేరెట్టేడు. కాగితాలు చేతిలోకి తీసుకు చూశాను. నీట్‌గా కొట్టివేతలు లేకుండా వుంది. పన్నెండు పేజీలుంది. దస్తూరీ బాగుంది.

"అతని ఏభై ఎనిమిది సంవత్సరాల జీవితకాలంలోనూ ఇదే మొదటి సారిగా అందుకున్న గ్రీటింగ్ కార్డ్- టేకాఫ్ చాలా పదునుగా వుందోయ్, వెరీగుడ్" అన్నాను, మొదటి లైన్ చదివి.

"మీరు టేకాఫూ లేండింగూ అంటేకాదు అంకుల్. కథంతాతప్పకుండా చదవాలి. ఇది నేను రాసిన మొదటి కథ. మీ ఆశీస్సులు కావాలి" అన్నాడు సురేష్.

ఆశీస్సులంటే ప్రశంసలు. దానికోసం కథ చదవనక్కర్లేదు. "తప్పకుండా చదువుతాను" అంటూ ఆ కాగితాల కట్ట డ్రాయర్ సొరుగులో పడేసేను. కాని నవ్వొచ్చింది. వాడు నా కథలు చదవలేదు కాని వాడి కథలు నేను చదవాలట- గ్రీటింగ్ కార్డు-రేషన్ కార్డూ, గ్రీన్ కార్డూ, పోస్ట్ కార్డూ, విజిటింగ్ కార్డూ- డేమిట్.

"అంకుల్! అలా నవ్వుతేకాదు. మీకు తెలుసున్న ఏ పత్రికలోనైనా పబ్లిష్ చెయ్యమని మీరు రికమెండ్ చెయ్యాలి. వెంకట్ చెప్పేడు మీకు చాలామంది పత్రికల వాళ్లు తెల్సునని." అన్నాడు.

"అలాగే" అన్నాను, మావాడు నా కీర్తిని దాని ప్రయోజనాన్ని గుర్తించినందుకు మురిసిపోతూ.

* * *

ఏకాంబర్రావు నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు. సాహిత్య పౌరోహిత్యంలో అభిలాష మితిమీరి కథలూ నాటికలూ రచించి సాహిత్యం మీద అత్యాచారం కొనసాగించడంతో పత్రికలవాళ్లు వాడికి దూరంగా వుండటం మొదలెట్టేరు. పత్రికా స్వాతంత్రం మీద సంపూర్ణ విశ్వాసమున్నవాడు కాబట్టి వాళ్లని తప్పుపట్టలేదు, పల్లెత్తు మాటనలేదు. తన పత్రికావ్రత్యం భంగం కాకూడదన్న ధృఢసంకల్పంతో తనే సొంతంగా 'సంచారి' అనే మాసపత్రిక ప్రారంభించి సాహిత్యాభ్యుదయ మహోద్యమానికి సారథ్యం వహించాడు. సాహిత్యాన్ని ఉద్ధరించడం సంగతెలావున్నా సిద్ధ సంకల్పుడనిపించుకున్నాడు. పత్రిక నిరాఘాటంగా నడిపిస్తున్నాడు. మనిషి స్వతహాగా మంచివాడు. అన్నిటిలోనూ అందరిలోనూ మంచినే చూడాలన్నది వాడి స్వభావం. తన పత్రిక ద్వారా ఎందరినో సాహిత్యరంగ ప్రవేశం కలిగించాడు. ఎప్పుడు ఎక్కడ కనబడినా జిప్‌బేగ్ తెరిచి ఏసభకో, సదస్సుకో, సన్మానానికో ఆహ్వానపత్రిక అందిస్తూ వుంటాడు. వాడి సాహిత్య సేవాదీక్షకు మెచ్చి చదవాలని పట్టింపులేని తెలుగువాళ్లతోబాటు, ఎందరో తెలుగు రానివాళ్లు కూడా ఆ పత్రికకు చందా దారులుగా చేరేరు. ఆ మధ్యన ఏకాంబర్రావుని సాహిత్య బాధితుడుగానో, సాహిత్య ఖైదీగానో గుర్తించి, అకాడమీ వారి సిఫార్సు మేరకు, ప్రభుత్వం వాడి పత్రికకు కొన్ని రాయితీలు యిచ్చిందని విన్నట్టు జ్ఞాపకం, అప్పుడప్పుడు పోస్ట్‌లో వాడి పత్రిక రావడం చూస్తూనే వుంటానుకాని, కాని 'రేపర్'కూడా చింపే అలవాటు లేదు.

ఏకాంబర్రావొచ్చేడనగానే ఏ ఎడ్వర్టయిజ్‌మెంట్లకో అయివుంటుందనుకుంటూనే వున్నాను.

"ఏళ్లతరబడి చందా బాకీపడితే పత్రిక నడవడం ఎలాగురా!" అన్నాడు సోఫాలో కూర్చుని.

"పత్రిక పంపడం మానెసెయ్యాలి, లేదా ముందుగా రిమైండర్ పంపాలి" అన్నాను, నాకు తోచిన సలహాయిస్తూ.

"చందా కట్టడం మరిచిపోయినంత మాత్రాన పత్రిక పంపడం నిలిపెయ్యడం కేవలం వ్యాపారమవుతుంది. పైగా అలా నిలిపెయ్యడం మొదలెడితే ఏదో రోజున పత్రికా నిలిపెయ్యవల్సొస్తుంది. ఇది సాహిత్యానికి, సంస్కారానికి సంబంధించిన సున్నితమైన విషయం." అన్నాడు బాకీ పడ్డ చందాదారుల పట్టి చూస్తూ.

"నేనెన్నేళ్ల చందా బాకీ?" అడిగేను.

"వొస్తున్నా... ఇదిగో... మూడేళ్లు" అన్నాడు.

"బాప్రే!" నిజమే అయివుంటుంది. వాడబద్ధం ఆడడు.

"అయినా పత్రిక పంపడం మానేశానా! అదీ నా సంస్కారం." అన్నాడు.

"నీ సంస్కారానికో నమస్కారం. ఇక మీదటైనా ఏడాదికోసారి వసూలు చెయ్యి." అన్నాను.

చందా ఎకౌంట్ సెటిల్ చెయ్యడంతో బాటు తెలుసుకున్న రెండు కంపెనీలకి ఫోన్‌చేసి ఎడ్వర్‌టైజ్ మెంట్స్ ఇప్పించేను. వాడుసంతోషించాడు. సమయానికి సురేష్ కథ జ్ఞాపకమొచ్చి వాడికిచ్చేను. దానికేసి చూడనైనాలేదు. బ్రీఫ్‌కేసులో పడేసుకుంటూ, "ఓయస్, నెక్స్ట్ ఇష్యూలో వేస్తాను. పాస్‌పోర్ట్ సయిజ్ ఫోటో తీసుకుని రేపే మా ఆఫీసుకు రమ్మను." అన్నాడు లేస్తూ.

మర్నాడు సురేష్ నేను చెబితే వెళ్లేడు. 'సంచారికి' సంవత్సర చందా కట్టేసేడు. ఆడిన మాటతప్పకుండా ఆ నెల 'ఇష్యూ'లోనే అతని కథ పడింది. కవర్‌పేజ్ మీద టైటిల్ దగ్గిరా సురేష్ ఫోటో వేసేడు. సురేష్ ఆనందానికి అవధులు లేవు. ఆ పత్రిక పట్టుకొచ్చి చూపెట్టేడు. ఎన్నడూ నా కథలు బాగున్నాయనని మా అబ్బాయి అతని కథ చాలా బాగుందని సర్టిఫైచేశాడు. "అవునవును నేనూ చదివేను, చదివేకే ఏకాంబర్రావు కిచ్చేను." అని అబద్ధమాడేను.

* * *

ఈ మధ్యనే ఓరిసెప్షన్‌లో సుప్రసిద్ధ కథారచయిత కం. గో. రా. కనబడ్డాడు. మేమందరం రెండు మూడేళ్లలో డెబ్బయ్యో పడిలోకి అడుగెట్టబోతున్నాం. వాడూ యిప్పుడు రాస్తున్నట్టు లేదు.

"ఏరా! నీ కథలీ మధ్య పత్రికల్లో కనబడటంలేదు!" అని పరామర్శించాను.

"రాయడంలేదు. నువ్వో?" అడిగేను.

"డిటో"

"గుడ్"

"ఏం?"

"హాఁ" అన్నాడు నిర్లిప్తంగా.

"మొన్న సర్వేశ్వర్రావు కనబడి...."

"కథరాసి పంపమన్నాడు అవునా?"

"ఊఁ" అన్నాను.

"రాసేవా?"

"ఇంకా లేదు"

"రాయకు"

"ఎంచేత?"

"రాయలేవు"

"చూస్తా"

"రాసినా వేయడు."

"స్వానుభవమా?"

"నన్నూరాయమన్నాడు. రాయను."

"బాగుండదు."

"అందుకే."

"ఏమిటి అందుకే?"

"కథ రాసినా బాగుండదు."

"నీకథా? నాకథా?"

"రెండూనూ."

"ఎలా చెప్పగలవు."

"రాసిచూడు."

"నాన్‌సెన్స్."

"సరే నీ ఖర్మ."

"నేను రాసి పంపిస్తే ఎందుకు వెయ్యడు?"

"నువ్వు రాస్తావు, పంపుతావు, కథ అతనికి నచ్చదు."

"ఎందుకు నచ్చదు?"

"అతనికి కావల్సింది నువ్వు రాసింది కాదు."

"వాడ్డూయూ మీన్?"

"నీలోవుండే రచయిత రాసింది తనకి కావాలి."

"నాలో యిప్పుడు రచయిత లేడంటావా?"

"జవసత్తువలు సన్నగిల్లి చరమ దశలో వుంటాడు."

"ఏమిట్రా నువ్వనేది! మన మేదో జీవచ్ఛవాలమైనట్టు మాట్లాడుతున్నావు! మనమేమీ మంచ మెక్కలేదు. హాయిగా తింటున్నాం, తిరుగుతున్నాం, మన మనస్సులో స్పందన వుంది."

"మన స్పందన మన అనుభవాలకు, అభిప్రాయాలకూ మాత్రమే పరిమితం. వియ్ ఆర్ నౌ గుడ్ రిపోర్టర్స్ బట్ నో లాంగర్ క్రియేటివ్ థింకర్స్."

"నేనలా అనుకోను. నువ్వెందు కలా అనుకుంటావో తెలీదు." అన్నాను.

"నా భావావేశాలతో ఊహలల్లి, ఆ ఊహలను భాషలోకి అనువదించి రూపాన్నివ్వగల సృష్టికర్త నాలో వున్న రచయిత. వాడు రాస్తే బాగుంటుంది, అందరికీ నచ్చుతుంది. నేను రాస్తే బాగుండదు. కాని నాలో వున్న రచయిత అలసిపోయాడు, నీరసించిపోయాడు, రాయలేడు."

"డేమిట్! నీదంతా మెట్టవేదాంతం. నీకు ఆత్మ విశ్వాసంలేదు. ఎంత మంది రచయితలు ఆఖరిశ్వాస వరకూ రాయడంలేదు."

"రాయడం రాయక పోవడం గురించి మనం చర్చించడంలేదు, బాగా రాయడం గురించి."

"చచ్చే వరకూ చక్కగా రాసిన వాళ్లెంత మందిలేరు?"

"అంకితమైన కళాతపస్వికది సాధ్యం, మనకికాదు. మనం గొప్ప రచయితలమని మనకి అహంకారం, మన రచనలను పొగడక పోతే భరించలేం, ఇతరుల రచనల పట్ల చులకనభావం, ఇవిమనలో దినదిన ప్రవర్ధమాన మవుతున్న అసమర్ధతకి చిహ్నాలు. అవునా కాదా?" అన్నాడు నవ్వుతూ.

"కాదనడానికి నేనెవణ్ణి! నిన్ను గురించి నువ్వు చెబుతున్నావు." అన్నాను.

"నిన్నుగురించి కూడాను. లేటెస్ట్, 'సంచారి' చదివేవా?" అడిగేడు.

"దాన్ని చదివే అలవాటు లేదు. ప్రతి చందా దారుడు దాంట్లో రచయితే. ఆంధ్ర రాష్ట్రంలో వున్న అక్షరాస్యుల కందరికీ అది అభిమాన పత్రిక" అన్నాను.

"చదివి వుండవని అనుకున్నాను."

"నువ్వు చదివేవా?"

"అందులో పడ్డ 'గ్రీటింగ్ కార్డ్' అన్న కథ నీ ద్వారానే వొచ్చిందని చెప్పి ఏకాంబర్రావు దాన్ని నాచేత బలవంతంగా చదివించాడు. బ్రిలియంట్ స్టోరి. ఆ సురేష్ నీకు తెల్సుట కదా! అది చదివేవా?" అడిగాడు.

"ఆ కథా! తీరు బడిగా చదువుదామని బద్ధకించాను." అన్నాను నీళ్లు నములుతూ.

"అదే!అదే! అదేరాఅబ్బాయి, మనవ్యాధి లక్షణం." అన్నాడు నవ్వుతూ, నేనూ నవ్వకుండా వుండలేకపోయాను. ఇంటి కెళ్లగానే ఆ కథ చదవాలనుకున్నాను.

★ ★ ★

"మొత్తం మీద కథ రాశాను. రాస్తున్నంత సేపూ ఇందులో కొత్త తన మేమీలేదనిపిస్తూనే వుంది. దానికి సాయం అడుగడుక్కీ కంగోరాగాడి మాటలు గుర్తుకొచ్చి నా మనస్సును పెనుభూతంలా ఆవహించి నా విశ్వాసాన్ని చెదగొట్టేవి. వాడి సిద్ధాంతం తప్పని రుజువు చెయ్యడానికి పట్టుదలతో రాశాను. నాలో రచయిత వున్నాడో వూడేడో, ఉండి నవ్వుకుంటున్నాడో తెలీదుకాని కథ పూర్తయ్యేటప్పటికి తల ప్రాణం తోకకొచ్చింది. వారం రోజులు ఆలోచించి దానికి మెరుగులు దిద్దేను.

ఆలస్యం చెయ్యకుండా నేనే స్వయంగా ఆ కథని సర్వేశ్వర్రావు చేతుల్లో పెట్టేను. చాలా సంతోషించాడు. వెంటనే సబ్ ఎడిటర్ ప్రమీలను పిలిచి నాపేరు చెప్పి నన్ను పరిచయం చేస్తూ, "ఈయన్ని యెరుగుదువా?" అని అడిగాడు. "ఆయన్ని ఎరుగను కాని ఆయన 'చిలక జోస్యం' ఎరుగదును" అంది. ముగ్గురం నవ్వుకున్నాం.

"బైదిబై నువ్వు చెప్పిన 'గ్రీటింగ్ కార్డ్' చదివేను. ఫైన్ స్టోరి, సటిల్ హ్యూమర్.... వెరీ ప్రోమిసింగ్ రైటర్. ఎవరీ సురేష్?" అని ప్రమీలని అడిగేడు ట్రేలోంచి 'సంచారి' ప్రతి ఆమె చేతికిస్తూ.

"మా కాలేజ్ లెక్చరర్ సార్. నేను యమ్మే చదువుతున్నప్పుడు ఎకనామిక్స్ చెప్పేవాడు. ఇదివరకు రెండు రేడియో నాటికలు రాసారు. ఆశ్చర్యమేమిటంటే ఇది ఆయన మొట్టమొదటి కథట." అంది.

"ఆశ్చర్యమేమీలేదు. మొదట్లో రాసిన కథలు వాళ్లంతకి వాళ్లు రాయదల్చుకుని రాసిన కథలు. దీపావళి స్పెషల్ ఇష్యూకి రాయగలడేమో కనుక్కో.... ఇదిగో దీన్ని కూడా స్పెషల్ ఇష్యూఫైల్లో పెట్టు" అంటూ నాకథ వ్రాత ప్రతిమీద 'దీపావళి' అనిరాసి సంతకంపెట్టి ఆమెకిచ్చాడు. సురేష్‌కి నేనే చెబుతాను అందామనుకున్నాను. కాని తీగలాగితే డొంకంతా కదుల్తుందని ఊరుకున్నాను. పైగా ఆ కథ చదవడం పడలేదు.

నాలుగు రోజుల్లో దీపావళి అనగా ఒక ప్లాస్టిక్ సంచీతీసుకుని సురేష్ ఓ ఉదయాన్నే మాయింటి కొచ్చాడు. నా చేతుల్లో వున్న న్యూస్ పేపర్ తీసేసి పక్కన పెట్టేడు. సంచీలోంచి ఓ ఖద్దరు శాలువా తీసి నా బుజాల మీద కప్పి నాకు పాదాభివందనం చేసి, టీపాయ్ మీద స్వీట్స్ పేకట్ పెట్టి దీపావళి ప్రత్యేక సంచికలో తనకి ఫస్ట్‌ప్రయిజ్, మూడువేలు తెచ్చిన 'లేడీస్ ఫస్ట్' అనే కథ పడిన పేజీ తిప్పి నా చేతుల్లో పెడుతూ, "అంకుల్ ఇదంతా మీ ఆశీస్సుల ఫలం" అన్నాడు. సురేష్‌ని ఆశీర్వదించేక అతను వెళ్లి పోగానే గబగబ పత్రిక తిరగేసేను. నా కథ లేదు. వీలు వెంబడిని ప్రచురించడానికి సెలక్ట్ చేసిన కథల లిస్ట్‌కూడా చూశాను. అందులోనూ లేదు. శాలువా తీసి సోఫామీదికి విసిరేసి కుర్చీలో కూలబడ్డాను. వాడి కథ చదవడానికి మనస్కరించలేదు, అసలు ఆ పత్రికలో ఏ కథా చదవదల్చుకోలేదు. దాన్ని మడిచి టీపాయ్ మీద పడేసి యాంత్రికంగా న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకున్నాను.

** రచన, సెప్టెంబరు 1997*